జాబితాలో కనిపించని పేర్లు

- గందరగోళంలో పేదలు
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు రావేమోనని ఆందోళన
- నేటి నుంచి గ్రామ సభలు
- గ్రామసభల్లో నిలదీతలు ఉత్పన్నమయ్యే అవకాశం



పైకప్పు కూలిన నర్సవ్వ ఇల్లు



చీరలు అడ్డుపెట్టిన నాగమణి ఇల్లు

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్ కార్డుల సర్వే గందరగోళంగా మారింది. ఉన్నతాధికారుల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చిన జాబితాలో తమ పేరు లేదంటూ పేదలు ఆందోళన చెందుతున్నారు. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన బాయికాడి చాకలి నర్సవ్వ, నాగమణి(ఇంటి నెంబరు 10–57) ఇద్దరికి భర్తలే లేరు. అనారోగ్యంతో 8 ఏళ్ల క్రితం మరణించారు. ఉన్న ఇల్లు పూర్తిగా కూలిపోయింది. పైకప్పు ప్లాస్టిక్ కవర్లు, చీరలు అడ్డంగా పెట్టుకొని జీవిస్తున్నారు. ఇలాంటి అర్హులైన వారి పేర్లు సర్వే జాబితాలో గల్లంతు కావడంతో నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. నర్సవ్వ, ఈరవ్వ, ములింటి సాయిలు, మేస్త్రీ మారుతి ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వీరిని అనర్హుల జాబితాలో చేర్చారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ జాబితాలో 824 మందే..

బిచ్కుంద మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో 824 మందికి మాత్రమే రేషన్ కార్డుల జాబితాలో పేర్లు వచ్చాయి. జిల్లా అధికారుల నుంచి నివేదికను మండలానికి పంపించారు. వారి ఆదేశాలతో మండల అధికారులు 824 మంది ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రజా పాలనలో 16,421 మంది పథకాల కోసం దరఖాస్తులు పెట్టుకోగా 14,054 ఇళ్లలో సర్వే చేశారు. అందులో 824 మందికి కార్డుల జాబితాలో పేర్లు రావడం గమనర్హం. 2016లో మీ–సేవలో రేషన్ కార్డుల కోసం 2,567 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. సర్వేలో వారి పేర్లు లేకపోవడంతో బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ఆపరేటర్ల తప్పిదమే కారణమా..?

ప్రజాపాలన, సమగ్ర సర్వే దరఖాస్తులు త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలనే ఉద్దేశంతో అధికారులు ప్రైవేటు ఆపరేటర్లతో పాటు ఇతరుల నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టడంతో చాలా తప్పులు జరిగాయి. కొన్ని దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ కాలేదు. ఈ నెల 21 నుంచి 23 వరకు అధికారులు గ్రామ సభలు పెట్టి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారుల పేర్లు ప్రకటించనున్నారు. చాలా మందికి రాకపోవడంతో గ్రామసభలో గందరగోళం, నిలదీతలు ఎదురయ్యే అవకాశం ఉంది.

కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి అవుతోంది. ఆరు పథకాలలో కొందరికి మాత్రమే పథకాలు అందుతున్నాయి. రేషన్‌కార్డులు లేకపోవడంతో రాయితీ సిలిండర్లు, విద్యుత్ రాయితీ పథకం అందడం లేదు. సర్వేలో మా పేర్లు కనబడటం లేదని సంక్షేమ పథకాలు అందకుండా పోతాయని బాధితులు ప్రతి రోజు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మా చేతిలో ఏమి లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. అధికారులు ఇళ్లకు రాకుండా సర్వే పూర్తయిందని అనడం విడ్డూరంగా ఉంది. క్షేత్రస్థాయిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జాబితాలో పేరు లేదు

రేషన్ కార్డు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నామని ప్రజా పాలన, సమగ్ర సర్వేలో దరఖాస్తు పెట్టుకున్నాను. రేషన్ కార్డు సర్వే జాబితాలో నా పేరు లేదు. కలెక్టర్ స్పందించి దరఖాస్తులు పరిశీలించి కార్డులు ఇవ్వాలని కోరుతున్నాం.

– పర్వీన్ బేగం, బిచ్కుంద

పైకప్పు కూలిపోయింది

ఇంటి పెద్ద దిక్కు కోల్పోయాం. ఇంటి పైకప్పు కూలిపోయింది. పైకప్పుపై చీరలు పెట్టి నివసిస్తున్నాం. అధికారులు మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు. సర్వే జాబితాలో పేరులేదని చెబుతున్నారు.

– బాయికాడి నాగమణి, బిచ్కుంద

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తుందని, అందులో భాగంగా నేటి నుంచి వార్డుల వారీగా గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. ఇది వరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గ్రామ సభల్లో వెల్లడించాలని అన్నారు. అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ అధికారులు మల్లికార్జున్‌రెడ్డి, తుల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై మహేష్



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు



దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ ఎస్సై మహేష్ అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా లైన్స్, హెచ్చరిక బోర్డులు, డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్ ధరించడం తదితర అంశాల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది తారాసింగ్, శ్రీకాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో భారీ ర్యాలీ

మాచారెడ్డి: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రం నుంచి గజ్యా నాయక్ తండా చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాచారెడ్డి ఎస్సై అనిల్ కామారెడ్డి ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనల గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు బాబు గౌడ్, రాంరెడ్డి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులున్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయొద్దు

దోమకొండ: మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జాతీయ భద్రత వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. కానిస్టేబుళ్లు వెంకటేష్‌గౌడ్, వినోద్ యాదవ్, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

కౌమార దశపై అవగాహన



భవానీపేట పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వర్ద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు



నర్సన్నపల్లిలో బహుమతులతో విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): కౌమార దశలో బాలబాలికల్లో వచ్చే మార్పులపై భవానిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వర్ద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. రుతుచక్రం, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక ఆరోగ్యం, లైంగిక వ్యాధులు, రక్తహీనత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల బాలికల రక్షణ కోసం ఏర్పడిన చట్టాల గురించి వివరించారు. అలాగే విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నిహారిక, నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామారెడ్డి పరిధిలో..

కామారెడ్డి రూరల్: నర్సన్నపల్లి, తిమ్మక్‌పల్లి, క్యాసంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వర్ద్ సంస్థ ఆధ్వర్యంలో కౌమార దశపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వర్ద్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, సీసీ వంశీకృష్ణ, శ్రీవిద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు– వెయ్యి గొంతుకల సన్నాహక కళా ప్రదర్శన



నాగిరెడ్డిపేటలో డప్పులతో కళాప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు–వెయ్యి గొంతుకల కార్యక్రమానికి మద్దతుగా సోమవారం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గోపాల్‌పేట్‌లోని నల్ల పోచమ్మ ఆలయం నుంచి పెట్రోల్‌బంకు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో కళాప్రదర్శన చేపట్టారు. దీంతోపాటు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి చేరుకొని ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మార్పీస్ జిల్లా మహిళా అధ్యక్షులు సట్టిగారి లక్ష్మి, మండలాధ్యక్షుడు తొంట సాయిలు, నాయకులు కంతి పద్మారావు, దాసరి సాయిలు, లింగమ్మోళ్ల ఊషయ్య, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను వందశాతం రికవరీ చేయాలి



మాట్లాడుతున్న స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను వంద శాతం రికవరీ చేయాలని స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. స్త్రీనిధి రుణాలను రికవరీ చేయడంలో గ్రామ సంఘాల అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలని కోరారు. మార్చి 31 వరకు రుణాల రికవరీ 100 శాతం ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత, కోశాధికారి మణెమ్మ, ఏపీఎం జగదీశ్ కుమార్, అకౌటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



భిక్కనూరు: మెదక్ జిల్లా బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన మృతితో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న భిక్కనూరు మండలం ఇసన్నపల్లి, పెద్దమల్లారెడ్డి, భాగిర్తిపల్లి, కంచర్ల, భిక్కనూరులకు చెందిన ఆయన స్నేహితులు రూ.15 వేలను పోగు చేసి సురేష్ కుటుంబానికి సోమవారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



మాచారెడ్డి: పాల్వంచ మండల నూతన విద్యాధికారిగా ఫరీదుపేట పీజీ హెచ్‌ఎం రామ్మోహన్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు అశోక్ కుమార్, రూప్‌సింగ్, నరేందర్, బాల్ రాజు, అంతయ్య, వెంకటేష్, గోపి, శ్రీనివాస్ ఉన్నారు.

రాజ్యాంగం గొప్పతనం ప్రతి ఒక్కరికి వివరించాలి



కామారెడ్డి టౌన్: భారత రాజ్యాంగం గొప్పతనాన్ని జిల్లాలో ప్రతీ ఒక్కరికి వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్నరాజులు కార్యకర్తలకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనవరి 26 వరకు భారత రాజ్యాంగ 75 సంవత్సరాల వేడుకలను జరుపుకోవాలని జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ నరేందర్, నాయకులు నందివేణు, రవీందర్, రాజు, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్, రాజగోపాల్, బాలమణి, మల్లేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు గైని శివాజీ అన్నారు. సోమవారం సంగోజీవాడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు సీఎంరిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. పార్టీ నాయకులు లింగం, ప్రశాంత్, బాలాగౌడ్, ఆసిఫ్, రఫీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిలో సోమవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు. రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేతలు జొన్నల రాజు, అట్టెం శ్రీను, కిరణ్, ఏదుల్, నగేష్, సుప్పాల రాజు, భాస్కర్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి 2 లక్షల 35 వేల 880 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా క్రషింగ్ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ భవన మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్య

నిజాంసాగర్(జుక్కల్): పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ భవన మరమ్మతుల నిమిత్తం నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని బాన్సువాడ ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్య తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'ఇరుకు గదిలో ఇబ్బందులు' అంటూ వచ్చిన కథనానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పందించారు. ఇరుకు గదితో పాటు పెచ్చులూడుతున్న అంగన్ వాడి భవనాన్ని తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యను ఆదేశించారు. దీంతో సీడీపీవో మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2ను ఆమె సందర్శించారు. ఇరుకు గదిని ఖాళీ చేయిస్తామని తెలిపారు. సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడి టీచర్ శైలజ తదితరులున్నారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



మాచారెడ్డి మండలం సోమారంపేటలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



ఆర్గొండ పాఠశాలలో..



రామారెడ్డి బాలికల పాఠశాలలో..



వెల్లుట్ల జెడ్పీ పాఠశాలలో నిరసన తెలుపుతున్న వెంకట్

సాక్షి నెట్‌వర్క్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం రాములుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా సోమవారం స్కూళ్లలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేటి నుంచి బల్దియాలో వార్డు సభలు

కామారెడ్డి టౌన్: రేషన్‌కార్డుల సర్వేలో భాగంగా నేటి నుంచి 24వ తేది వరకు 49 వార్డులలో షెడ్యూల్ ప్రకారం సభలను నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. మంగళవారం 21వ తేదిన 1 నుంచి 10 అలాగే 41,42,43 వార్డులు, బుధవారం 22వ తేదిన 11వ వార్డు నుంచి 20 అలాగే 44, 45, 46వ వార్డులు, గురువారం 23వ తేదిన 21వ వార్డు నుంచి 30 అలాగే 47,48, 49వ వార్డులు, 24వ తేదిన 31 నుంచి 40 వార్డులు స్థానిక వార్డు పరిధిల్లోనే సభలు ఉంటాయని తెలిపారు.

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని పలు వార్డులలో మంగళవారం వార్డు సభలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దరఖాస్తులు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ గంగాధర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. పాత స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హెల్మెట్ తప్పకుండా ధరించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని ఎస్సై మహేందర్ తెలియజేశారు. సోమవారం అంజని చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. వాహనదారులు ప్రతి ఒక్కరు లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర ధ్రువపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది సాయిశివ, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

కాటేపల్లి ప్రీమియర్ లీగ్ విజేత సంగోజీపేట్ జట్టు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లిలో సంక్రాంతి సందర్భంగా కాటేపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఘనంగా నిర్వహించారు. 12 రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో 52 జట్లు పాల్గొన్నాయి. సంగోజీపేట్ గ్రామ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. వీరికి రూ.22,222 ప్రైజ్ మనీ, రన్నర్‌గా నిలిచిన కాటేపల్లి జట్టుకు రూ.11,111లను నిర్వాహకులు అందజేశారు. నాయకులు మల్లప్ప పటేల్, విజయ్ దేశాయ్, రామాగౌడ్, బస్వరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

యువతకు క్రీడల పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం క్రీడా పోటీలను హెచ్‌ఎం సాయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వాలీబాల్, కబడ్డీ పోటీలు పెట్టారు. గెలుపొందిన వారికి గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌గౌడ్, పీఈటీలు సంగమేశ్వర్, సంతోష్‌రెడ్డి, సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ పోచయ్య, దివ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల పల్లె నిద్ర

గాంధారి(ఎల్లారెడ్డి): పల్లె పల్లెకు కాంగ్రెస్, ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు చేస్తున్న అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి బూర్గుల్ గ్రామంలో పల్లె నిద్ర చేశారు. అంతకుముందు చలి కాచుకున్నారు. రాత్రి పూట గ్రామస్తులతో మాట్లాడారు. మాజీ ఎంపీటీసీ కామెల్లి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే నాణ్యమైన విద్య



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, నిపుణులైన అధ్యాపకులున్నారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం అన్నారు. సోమవారం ఆయన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే చేరాలని సూచించారు.

కోనాపూర్ గ్రామ మాలమహానాడు కమిటీ ఎన్నిక

బాన్సువాడ రూరల్: కోనాపూర్ గ్రామంలో మాల మహానాడు గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బేగరి పాపయ్య, ఉపాధ్యక్షులుగా గైని చిన్న సాయిలు, ప్రధాన కార్యదర్శిగా గైని రాములు, కోశాధికారిగా బేగరి వినోద్, సలహాదారులుగా లింగం, రాములును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బాన్సువాడ డివిజన్ అంబేద్కర్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

శ్రీరామ్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

కామారెడ్డి రూరల్: గర్గుల్ గ్రామ శ్రీరామ్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా హరీశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సంజీవచారి, కోశాధికారిగా మంగళి శివరాజు, సలహాదారులుగా బి.చిరంజీవిగౌడ్, శ్రీనివాస్, మ్యాదరి భైరయ్య, ఎస్.బాలకృష్ణలను ఎన్నుకున్నారు.